

మేయర్ పారిజాతకు కాలనీ సమస్యలు వివరిస్తున్న స్థానికులు

సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నాం

● బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కాలనీలు, బస్తీలు, గ్రామాల్లో ప్రజలెదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తున్నదని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. గురువారం అల్మాస్‌గూడ 24వ డివిజన్‌లోని ఎస్‌ఆర్‌హిల్స్ కాలనీలో కొత్తగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిపై అధ్యయనం చేసి ప్రాధాన్యతాక్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో..

మామిడిపల్లి 12వ డివిజన్‌లోని రంగనాయకుల కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్‌యాదవ్‌తో కలిసి మేయర్ పారిజాతానర్సింహారెడ్డి గురువారం ప్రారంభించారు. స్థానిక నాయకులు సతీశ్‌గౌడ్, భాస్కర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో బీరప్ప తదితరులు

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సరూర్‌నగర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్మల్ పట్టణంలో జరగనున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రంగారెడ్డి జిల్లా జట్టులో మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల లార్డ్స్ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు చోటు సంపాదించారు. ఈ క్రమంలో గురువారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు సంపత్, సందీప్, సుశాంత్, సాయినితీశ్, అక్షిత్‌లను లార్డ్స్ విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీలత, ప్రిన్సిపాల్ ఎం.ఎస్.మరియన్, పీఈటీలు లవకుమార్, మానస పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): దేశం గురించి, హిందువులపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మూసారాం బాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. భారతదేశంపై, హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బొక్క మధుసూదన్‌రెడ్డి అన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ హిందువులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి, బి.నర్సింహ, చందు, గజానంద్, శ్రీకాంత్, చందు, ప్రదీప్, భరత్ తదితరులు పాల్గొని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.

మలక్‌పేట ప్రభుత్వ కళాశాల విద్యార్థినులకు చేయూత

సైదాబాద్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం అవయం చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థినులకు ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీలో అత్యధిక మార్కులు సాధించిన గుర్రం సుస్మితకు రూ.5వేల పారితోషికం అందించారు. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ ట్రస్ట్ చేయూత నిస్తుందని చైర్మన్ సురేష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, ట్రస్ట్ ప్రతినిధులు దూబే, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నూనె ప్రభాకర్



ప్రభాకర్‌కు నియామక పత్రం అందజేస్తున్న అశోక్‌గౌడ్

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది నూనె ప్రభాకర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్, హ్యూమన్‌రైట్స్, సమాచార హక్కు కన్వీనర్‌గా నియమితులయ్యారు. కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తిస్తు బాధ్యతలు అప్పజెప్పినట్లు చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ తెలిపారు. ప్రభాకర్‌కు అశోక్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిలతో పాటు తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.



వరదబాధితుల సహాయార్థం నిత్యావసర వస్తువులతో కూడిన వాహనాన్ని ప్రారంభిస్తున్న ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నర్సింహారావు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అందరి బాధ్యత

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అందరి బాధ్యత అని గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ నర్సింహారావు అన్నారు. గురువారం ఆర్‌కేపురం డివిజన్‌లోని అష్టలక్ష్మీ ఆలయ ప్రాంగణం నుండి వరదబాధితుల సహాయార్థం నిత్యావసర వస్తువులతో కూడిన వాహనాన్ని నర్సింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులకు అందించేందుకు తమ అసోసియేషన్ తరఫున దాదాపు రూ. 20 లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులు, బట్టలు, చిన్నారులకు ఆట వస్తువులు, తీసుకెళ్లడం జరిగిందన్నారు. వెయ్యి కిట్లను వరంగల్‌లోని ములుగు, ఖమ్మం, నల్గొండలలోని బాధితులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం సతీష్, ఉపాధ్యక్షులు శ్యాంకిరణ్, పాండురంగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుధాకర్, విక్రంరెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి రవీంద్రకుమార్, కోశాధికారి ఉపేందర్, క్రెడాయి ఈసీ మెంబర్, మొరిశెట్టి శ్రీనివాస్, యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్రమ్, ప్రధాన కార్యదర్శి మేఘన, కోశాధికారి అక్షయ్, ఉపాధ్యక్షులు రతన్‌వాసు, అభినవ్ మహేష్, బద్రీనాథ్, రోహిల్, శ్రీనివాస్, అయిత అంజయ్య, జగన్, చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ అవిశ్వాసంపై బలపరీక్ష నేడు

● ఆర్డీఓ పర్యవేక్షణలో 11గంటలకు ప్రత్యేక సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్నపై ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై శుక్రవారం ప్రత్యేక సమావేశం జరగనుంది. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి పర్యవేక్షణలో అవిశ్వాస బలపరీక్ష ప్రత్యేక సమావేశాన్ని మున్సిపల్ పరిధిలోని తట్టిఅన్నారం వార్డు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశం ప్రారంభం కానుంది. చైర్‌పర్సన్ స్వప్నపై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ ఆగస్టు 19న 17 మంది కౌన్సిలర్లు తమ సంతకాలతో కూడిన లేఖను రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. పట్నం ఆర్డీవో పర్యవేక్షణలో సెప్టెంబర్ 13న బలపరీక్ష కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ కౌన్సిలర్లకు నోటీసులను అందజేసిన సంగతి తెలిసిందే.

చైర్‌పర్సన్ రాజీనామా చేస్తున్నట్లు ప్రచారం

ఇదిలా ఉండగా గురువారం చైరపర్సన్ స్వప్నచిరంజీవి తమ పదవికి రాజీనామా చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగింది. మధ్యాహ్నం జిల్లా కలెక్టర్‌కు చైర్‌పర్సన్ తన రాజీనామాను అందజేయనున్నట్లు ప్రచారం జరిగినా చివరకు ఆమె రాజీనామా చేయలేదు.

క్యాంపు నుంచి నేరుగా ప్రత్యేక సమావేశానికి..

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించిన 17 మంది మెజార్టీ కౌన్సిలర్లు నాలుగు రోజుల క్రితం క్యాంపుకు తరలివెళ్లారు. గురువారం సాయంత్రం వారంత తిరిగి నగరానికి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో నిర్వహించే బలపరీక్షకు హాజరు కానున్నారు.



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం

మాలల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ప్రతిఘటిస్తాం

● ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు బేర



సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): మాలల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ప్రతిఘటిస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు బేర బాలకిషన్, పెరికే కృష్ణప్రకాష్ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అంతకు ముందు సరూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలని లేకుంటే తెలంగాణలో మాలల విశ్వరూపాన్ని చూపిస్తామన్నారు. తెలంగాణ ఎస్సీ కులగణన చేయాలని ఆయన కోరారు. మాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు. తెలంగాణలో ఎస్సీలకు ఇప్పుడున్నటువంటి రిజర్వేషన్లను 15శాతం నుండి 20శాతానికి పెంచాలని కూడా ముఖ్యమంత్రిని కోరామన్నారు. 30 సంవత్సరాలుగా తెలంగాణలో మాలలకు అన్నింటా అన్యాయమే జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు మాలలకు రాకుండా కుట్రలు చేశారని ఆయన ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు నర్సింగరావు, జంగ్లీ కిషన్, గంగం శివశంకర్, నరేష్, తునికి పద్మాకర్, సునీల్, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

● జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య



జోనల్ లెవల్ కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జీహెచ్ఎంసీ డీసీ తిప్పర్తి యాదయ్య, కార్పొరేటర్ అరుణ, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య సూచించారు. గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉప్పల్ జోనల్ లెవల్ కబడ్డీ పోటీలను కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్, తెలంగాణ పర్యాటక సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల కృషితోనే తాము ఈ స్థాయిలో ఉన్నామన్నారు. ఉన్నతంగా ఎదిగిన విద్యార్థులు సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో క్రీడా పాలసీ తేనున్నారని ఆయన చెప్పారు. కార్పొరేటర్ మాట్లాడుతూ నాగోల్ ప్రభుత్వ పాఠశాలలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించడం హర్షణీయమన్నారు. క్రీడలకు నాగోల్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం(నోసా) సహకారం అభినందనీయమన్నారు. నాగోల్ హెడ్మాస్టర్ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాగోల్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కందికంటి కన్నాగౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, ఎంఈఓ రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, లింగంగౌడ్, రమేష్, ఉమామహేశ్వర గుప్తా, వెంకట్‌రెడ్డి, మహేందర్, జగన్, సహదేవ్, సాయిబాబాగౌడ్, కరుణాకర్, పీఈటీ శంకర్‌నాయక్, మమత, స్కూల్ గేమ్స్ కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఇనామ్‌ను పక్కాగా అమలు చేయాలి

● హైదరాబాద్ రీజియన్ మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు

ఓల్డ్‌మలక్‌పేట : మిర్చి సీజన్ త్వరలో రాబోతున్న తరుణంలో ఇనాంను పక్కాగా అమలుచేసి తీరాలని మిర్చి అసోసియేషన్ వ్యాపారులకు డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు సూచించారు. గురువారం మిర్చి అసోసియేషన్ సభ్యులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇనాంను పక్కాగా అమలు చేసి రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా అధికారులు వ్యాపారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఇనామ్ విషయంలో ఎవరు తప్పుదారి పట్టినా రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారని వారి సమస్యను దృష్టిలో పెట్టుకుని అమలు చేయాలన్నారు. ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్-1 అధికారి చిలుక నర్సింహారెడ్డి, పుష్ప పాల్గొన్నారు.

బీజేపీ సభ్యులుగా చేరి భారత్‌ను బలోపేతం చేయండి

● కేంద్ర మాజీమంత్రి రాజీవ్‌చంద్రశేఖర్



న్యాయవాదులకు సభ్యత్వం అందజేస్తున్న కేంద్ర మాజీమంత్రి రాజీవ్‌చంద్రశేఖర్, ఎంపీలు ఈటల, కొండా తదితరులు

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యులుగా చేరి భారత్‌ను బలోపేతం చేయాలని కేంద్ర మాజీమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం రంగారెడ్డి జిల్లా కోర్టుల సమీపంలో బీజేపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మండలిలో బీజేపీ పక్ష మాజీ నాయకుడు రామచందర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా నిలిచిందన్నారు. బీజేపీలో సభ్యత్వం ద్వారా ప్రధానమంత్రి మోదీ దేశాన్ని వికసిత్ భారత్ దిశగా నడిపించేందుకు మరింత బలం ఇవ్వాలన్నారు. తెలంగాణలో బీజేపీ బలోపేతం కావాలన్నారు. బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, బొక్క నరసింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ధీరజ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టా ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, పీఠం ప్రదీప్‌కుమార్, రాంరెడ్డి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు : రూ 30,000, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం

కొత్తపేట : ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో పేకాట ఆడుతున్న ఏడుగురు నిందితులను ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం పిండి నారాయణరెడ్డి కాలనీలోని అరుణ్ రెసిడెన్సీ అపార్టుమెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో ఆ ఫ్లాట్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ 30,000, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గణేశ్ నవరాత్రులతో ప్రజలకు ఐకమత్యం అలవడుతుంది

● మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



మీర్‌పేట్ మంత్రాలచెరువు వద్ద గణేశ్ నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా నిర్వహించే నవరాత్రి మహోత్సవాలతో ప్రజల్లో ఐకమత్యం పెరుగుతుందని, వారిలోని ఆధ్యాత్మిక భావన సైతం ద్విగుణీకృతమవుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. గణేశ్ నిమజ్జన ఉత్సవాలను, శోభాయాత్రలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె సూచించారు. మీర్‌పేట్‌లోని మంత్రాలచెరువు వద్ద జరుగుతున్న గణేశ్ నిమజ్జనాలను బుధవారం రాత్రి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులను పలకరించి అక్కడి ఏర్పాట్లపై ఆరాతీశారు. అక్కడ ఉన్న మునిసిపల్, ట్రాన్స్‌కో, పోలీసు సిబ్బందితో మాట్లాడి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ గణేశ్ నవరాత్రులు ముగిసేదాకా అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు నిమజ్జన వేళలో జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏకదంతుడి నవరాత్రులు



అల్కాపురియూత్ అసోసియేషన్ ప్రతిష్ఠించిన గణపతిని దర్శించుకున్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మధు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు భజనలు, అర్చనలు చేస్తూ లంబోదరుడిని వేనోళ్ల కొలుస్తున్నారు. బుధవారం రాత్రి అల్మాస్‌గూడలో శ్రీసీతా రామాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో పూజలందుకుంటున్న వినాయకుడిని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ తదితరులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. వారికి ఉత్సవ సమితి అధ్యక్షుడు రామిడి కృష్ణారెడ్డి స్వామి వారి లడ్డూ ప్రసాదం అందజేశారు.

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పూజలు

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ, వినాయకహిల్స్, నాదర్‌గుల్, బడంగ్‌పేట్ తదితర ప్రాంతాల్లోని విఘ్నేశ్వరుడిని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి దర్శించుకుని అర్చనలు చేశారు. ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అల్కాపురి యూత్ గణపతిని దర్శించుకున్న దేప

ఎల్‌బీనగర్ : మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌లోని అల్కాపురిలో అల్కాపురి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజల్లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, పిట్టా హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, పగడాల శ్రీశైలం, భూపాల్‌రెడ్డి, తిలక్, కృష్ణ, నగేష్, జావేద్, శ్రీకాంత్, కిట్టు, సంతోష్, కోటయ్య పాల్గొన్నారు.

స్నేహపురికాలనీ యూత్ గణేశ్ మండపంలో..

కొత్తపేట: కొత్తపేట డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీరోడ్ నెం 6లో యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మండపంలో గురువారం కాలనీ ప్రతినిధులు గణేశుడికి భక్తి శ్రద్ధలతో పూజలు చేయించారు. పూజల్లో కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు అనంతుల సురేందర్‌రెడ్డి, ప్రతినిధులు లక్ష్మారెడ్డి, వీక్షిత్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, ప్రసాద్, బాబీ పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంభవించిన వరదల వల్ల నష్టపోయిన వారిని ఆదుకునేందుకు హైదరాబాద్‌కు చెందిన సిటిజన్ కోఆపరేటీవ్ సొసైటీ ముందుకు వచ్చింది. సొసైటీ తరఫున చైర్మన్ పీఆర్‌వీఎస్ రాజు, మేనేజింగ్ డైరెక్టర్ కేవీ సుబ్బయ్యలు వరద బాధితుల సహాయార్థం రూ. 10 లక్షల చెక్కును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అందజేశారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



రోడ్డు భద్రతపై ట్రైనీ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

అంబర్‌పేట, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ట్రైనీ పోలీసులకు రోడ్డు భద్రతపై అంబర్‌పేట పీటీసీలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి, బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. లైసెన్స్‌లు లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానా, మూడు నెలల జైలుశిక్ష ఉంటుందన్నారు. వాహనం నడిపే వ్యక్తి వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రైనీ పోలీసుల సందేహాలకు వారు సమాధానం ఇచ్చారు. 400మంది ట్రైనీ పోలీసులు పాల్గొన్నారు.

కొత్తపేటలోని పీవీటీ మార్కెట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం పూజా కార్యక్రమాలను పల్లవి హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ జెల్ల నర్సింహ దంపతులు నిర్వహించారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



ఆజంపుర జట్‌ఫట్‌నగర్‌లో పాము కలకలం



పామును పట్టుకున్న నజీర్‌ఖాన్

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): ఆజంపుర డివిజన్‌లోని జట్‌ఫట్‌నగర్ బస్తీ ఐజాజ్ స్కూల్ సమీపంలో గురువారం రోడ్డుపై పాము కనిపించడంతో స్థానికులు కలవరపడి పరుగులు తీశారు. స్థానికుడు నజీర్ ఖాన్ పామును పట్టుకుని డబీర్‌పుర పోలీసులకు అప్పగించారు. పోలీసులు స్నేక్ స్నాచర్‌ను పిలిపించి పామును అప్పగించారు.

డీసీఎం కంటైనర్ బోల్తా..



అబ్దుల్లాపూర్‌మెట్ : అదుపు తప్పిన డీసీఎం కంటైనర్ అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై బోల్తా పడింది. చౌటుప్పల్ నుంచి హైదరాబాద్ వైపుకు వస్తున్న కంటైనర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడవద్దని మందలించారని ఇంటిని వదిలి వెళ్లిన గృహిణి

కొత్తపేట, సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): నాగోల్ పీఎస్ పరిధి ఓల్డ్ నాగోల్‌లో ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడ వద్దని మందలించారని ఓ వివాహిత ఇంటిని, చిన్ని పాపనూ వదిలి వెళ్లిపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే చనిపోతానంటూ భర్తకు ఫోన్‌చేసి చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రాల ప్రశాంత్‌గౌడ్ భార్య ఇంద్రాల రితికా(21), కుమార్తె వేదాంతి(ఒకటిన్నర సంవత్సరాలు)లతో కలిసి ఓల్డ్ నాగోల్‌లో ఉంటున్నాడు. అతడు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆమె అస్తమానం ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేది. అలా ఫోన్‌లో మాట్లాడుతూ ఉండడం మంచిది కాదని ఆమెను భర్త మందలించేవాడు. ఈనెల 10వ తేదీన ఆమె తల్లిదండ్రులూ ఇంటికి వచ్చి ఫోన్‌లో మాట్లాడుతూ ఉండడం మంచిది కాదని మందలించి వెళ్లారు. గురువారం ఉదయం 6గంటలకు భర్త ఇంటి నుండి విధులకు వెళ్లిపోయాడు. 9.30కు ఆమె అతడికి పరిచయం లేని నెంబర్ నుండి ఫోన్‌చేసి తాను చిన్ని పాపను అతడి తండ్రి జంగయ్యగౌడ్ వద్ద వదిలి వెళ్లిపోతున్నానని, తన కోసం వెతక వద్దని, పోలీసులకు ఫిర్యాదు చేస్తే చనిపోతానని చెప్పి ఫోన్ కట్ చేసింది. వెంటనే అతడు ఇంటికి చేరుకుని ఆమె ఆచూకీ కోసం తెలిసిన వారిని, బంధువులనూ సంప్రదించాడు. ఫలితం దక్కక అతడు సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాదర్‌గుల్‌లో వివేకాంద యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని దర్శించుకున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, శ్రీరాములుయాదవ్

గణపతుల పూజలో మాజీ కార్పొరేటర్ కొప్పుల

హయత్‌నగర్: గణేశుడి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి డివిజన్ పరిధిలోని సీఆర్‌ఆర్‌నగర్, వినాయకనగర్ కాలనీలోని పలు మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా సీఆర్‌ఆర్ కాలనీలో వినాయకుడి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీసీ డైరెక్టర్ టంగుటూరి నాగరాజు, నాయకులు నర్సింహగౌడ్, బొడిగె స్వామిగౌడ్, వెంకట్‌గౌడ్, యాదాచారి, సుదర్శన్ రెడ్డితో పాటు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనం

సైదాబాద్ : సైదాబాద్, ఐఎస్‌సదన్, కుర్మగూడ, అక్బర్‌బాగ్ డివిజన్‌లలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పలు మండపాల వద్ద నేతలు, సంఘాల ప్రతినిధులు, ఇతరులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786